హైదరాబాద్‌లో మజ్లిస్‌ను ఓడిస్తాం: మాధవీలత


గోషామహల్‌లో ప్రచారం చేస్తున్న మాధవీలత, గోపాల్‌జీ, లాల్‌సింగ్

అబిడ్స్: హైదరాబాద్‌లో మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీని చిత్తుగా ఓడిస్తామని హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత పేర్కొన్నారు. గోషామహల్ పరిసర ప్రాంతాల్లో కార్పొరేటర్ లాల్‌సింగ్, బీజేపీ రాష్ట్ర కార్యాలయ కో ఆర్డినేటర్ గోపాల్‌జీతో కలిసి ఆమె ప్రచారం నిర్వహించారు. అనంతరం మాధవీలత మాట్లాడుతూ..మజ్లిస్ ఎంపీ ఒవైసీ మైనార్టీలను మోసం చేస్తున్నారన్నారు. మైనార్టీ ఓట్లతో విజయం సాధిస్తూ వస్తున్న ఒవైసీ మైనార్టీలకు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ప్రజలంతా మోదీ పథకాలకు ఆకర్షితులై బీజేపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పదేళ్లుగా తాను పాతబస్తీలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు, ప్రధాని నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలతో తాను విజయం సాధిస్తానన్నారు. అన్ని వర్గాల ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణా గుప్తా, గోషామహల్ బీజేపీ అధ్యక్షులు నత్రాజ్ నామ్‌దారి, గోషామహల్ బీజేపీ ఇన్‌చార్జి సోమ్‌రాజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీపీ సాయి చైతన్యకు ఆహ్వానం


డీసీపీకి ఆహ్వానం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర

గౌలిపురా: ఈనెల 23న హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే హనుమాన్ శోభాయాత్రకు హాజరుకావాలని కోరుతూ శనివారం దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యను పురానీహవేలిలోని తన కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, నాయకులు కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. గౌలిపురా హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమై సుల్తాన్‌షాహీ, గౌలిపురా, ఉప్పుగూడ హనుమాన్‌నగర్, ఛత్రినాక, లాల్‌దర్వాజా, లాల్‌దర్వాజా మోడ్, శాలిబండ రాజేశ్ మెడికల్ హాల్, అక్కన్న మాదన్న ఆలయం, బేలా చౌరస్తా, మీర్ కా దయారా మీదుగా గౌలిపురా వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్, ఎం.ఉదయ్ కిరణ్ రెడ్డి, అభిలాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


డిప్యూటీ ఈఓ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

చాంద్రాయణగుట్ట: విద్య పేరుతో వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల అనుమతులు రద్దు చేయాలని డీవైఎఫ్‌ఐ సౌత్ జిల్లా కార్యదర్శి ఎ.కృష్ణా నాయక్ డిమాండ్ చేశారు. ఫీజులు పెంచుకుంటుపోతున్న పాఠశాలల తీరును వ్యతిరేకిస్తూ డీవైఎఫ్, ఎం.వీ.ఫౌండేషన్ ఆధ్వర్యంలో బండ్లగూడ మండల ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం ముందు శనివారం నిరసన చేపట్టారు. కృష్ణా నాయక్ మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరానికి ఇప్పటి నుంచే కొన్ని పాఠశాలలు ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. నోట్, టెక్స్ బుక్స్, యూనిఫారం, బూట్ల దగ్గరి నుంచి అన్ని పాఠశాలలోనే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులను పీడిస్తున్నారన్నారు. విద్యాబోధన విషయంలో లోపభూయిష్టంగా అనుసరిస్తున్న పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సుబానీ, వినోద, లావణ్య, మీనాక్షి, నాగలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలోనే పాతబస్తీ అభివృద్ధి


ధూల్‌పేట్‌లో పర్యటిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్, హెచ్.కుమార్ తదితరులు

అబిడ్స్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే పాతబస్తీ ఎంతో అభివృద్ధి చెందిందని హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు పాతబస్తీలో చేపట్టిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. ధూల్‌పేట్‌లో ఆయన శనివారం పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తనను గెలిపిస్తే పాతబస్తీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. మజ్లిస్, బీజేపీలను ప్రజలు చిత్తుగా ఓడించాలన్నారు. మతం పేరుతో ఓట్లు దండుకునే మజ్లిస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని ఆయన అన్నారు. మజ్లిస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి: అసదుద్దీన్ ఒవైసీ


ప్రచారంలో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

చార్మినార్: ఈ ఎన్నికలలో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని హైదరాబాద్ సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్థానిక ఓటర్లను కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన చార్మినార్ సమీపంలోని షెహరాన్ హోటల్ గల్లీలో పాదయాత్ర నిర్వహించి ఎన్నికల ప్రచారం చేపట్టారు. స్థానిక వ్యాపారులు భవనాలపై నుంచి గులాబీ పూల వర్షం కురిపించి ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హైదరాబాద్ నగరంలో తమకు ప్రత్యేక స్థానం ఉన్నదని...గత కొన్ని రోజులుగా తమను డిస్ట్రబ్ చేయాలని చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీ విజయం సాధిస్తేనే..తమ ప్రాంతాల అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు.

పాతబస్తీలో అసదుద్దీన్ ఒవైసీ ప్రచారం

దబీర్‌పురా: మజ్లిస్ పార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ శనివారం పురానీహవేలి, నూర్ ఖాన్‌బజార్ తదితర ప్రాంతాల్లో చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ హఫందీ, కార్పొరేటర్లతో ఇంటింటికి తిరుగుతూ మజ్లిస్ పార్టీ అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి అన్వర్ సాదత్ పాల్గొన్నారు.

జోరుగా అక్రమ నీటి దందా

- అడ్డూ అదుపు లేకుండా అక్రమ నీటి వ్యాపారం
- నివాస స్థలాల్లోనే బోర్లు వేసుకోని..
- పట్టించుకోని అధికార యంత్రాంగం


ఓ నివాస స్థలం నుంచి నీరు నింపుకుంటున్న ట్యాంకర్

గోల్కొండ: అక్రమ నీటి దందా జోరుగా సాగుతుంది. గతంలో కేవలం వాణిజ్య అవసరాలు ఉన్న వారే ప్రైవేటు నీటి ట్యాంకర్లు తెప్పించుకునే వారు. అయితే బోర్లల్లో నీరు అడుగంటిపోవడంతో కాలనీలతో పాటు హౌజింగ్ కాంప్లెక్సులు, భవన సముదాయాల్లో బోర్లు ఎండిపోయాయి. ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకొని ప్రైవేటు నీటి వ్యాపారులు అక్రమంగా బోర్ల నుంచి నీరు తోడుకుంటూ తమ దందా కొనసాగిస్తున్నారు. నివాస స్థలాల్లోనే బోర్లు వేసుకోని ప్రత్యేకంగా ఆ నీటిని అమ్ముకుంటున్నారు. ఈ దందా వల్ల తమ ఇళ్లల్లోని బోర్లు ఇంకిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతా జరుగుతున్నా అధికారులు తమకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జలమండలి నీటి ట్యాంకర్లకు బుక్కింగ్‌లు పెరగడం అవి త్వరగా అందకపోవడంతో ప్రైవేటు ట్యాంకర్లకు భారీగా డిమాండ్ పెరిగింది. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు నగర శివారు ప్రాంతాల నుంచి సైతం అక్రమంగా నీటిని నగరానికి తరలిస్తున్నారు. బస్తీలు, కాలనీల మధ్య ఉన్న బోర్ల నుంచి నీటిని తోడుకుంటున్నారు. అక్రమ నీటి వ్యాపారులకు స్థానిక నాయకుల అండదండలు పుష్కలంగా ఉంటున్నాయి. పలువురు నాయకులు తెరవెనుక ఉండి నీటి దందాను కొనసాగిస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలు, పాత ఇళ్లను నీటి వ్యాపారులు ప్రత్యేకంగా కొంటున్నారు. ఆ స్థలాల్లో బోర్లు వేసి నీటిని వాణిజ్య అవసరాలకు అమ్ముకుంటున్నారు. పలుమార్లు నీటి వ్యాపారుల గొడవలు జరిగాయి. అయితే షరామామూలే అన్నట్లు ఇటూ అధికారులు, అటూ నాయకుల అండదండలతో వారి మాటే చెల్లుతుంది. నగర శివారు నుంచి ట్యాంకర్లల్లో వచ్చే నీరు అపరిశుభ్ర ప్రదేశాల నుంచి తెస్తున్నారు. పలుమార్లు ట్యాంకర్లల్లో రంగు మారిన నీరు వస్తుందని పలువురు అంటున్నారు. అధికారులు తమ ఉనికిని చాటుకోవడానికి అడపదడప క్రమంగా నీటిని తోడుకుంటున్న బోర్ల వద్దకు వచ్చి వాటిని సీజ్ చేస్తున్నారు.సీలైన మరునాటి నుంచే మళ్లీ నీటిని తోడుకుంటున్నారు. కొంత కాలం క్రితం ఇబ్రహీంబాగ్, వన్‌మోర్‌నగర్‌లో కొనసాగుతున్న అక్రమ నీటి వ్యాపారాన్ని అధికారులు ఆపి వేయించారు. అనంతరం అధికారులు అటువైపు కనెత్తి చూడడం లేదు. దీంతో అక్రమ నీటి వ్యాపారం యధావిధిగా కొనసాగుతుంది.



అబ్బాస్..శభాష్

ఫొటోగ్రాఫర్‌గా నగరంలో చిరపరిచితుడైన అబ్బాస్ హుస్సేన్ ప్రకృతి, అందమైన ప్రదేశాలు, అరుదైన పక్షుల ఫొటోలు తీయడంలోనూ ప్రసిద్ధుడు. ఫొటోలు తీస్తూ తీస్తూ ఆయనకు పక్షులంటే అమితమైన ప్రేమ ఏర్పడింది. రెండు దశాబ్దాలుగా ఆయన పక్షులకు దానా వేస్తూ పక్షి ప్రేమికుడిగా పేరు పొందాడు. తన వాహనంలో ఎప్పుడు సుమారు రెండు కిలోల జొన్నలు, ఇతర దానాలు పెట్టుకుని ఎక్కడ పక్షులు కనిపిస్తాయో అక్కడే ఆగి వాటికి దానా వేస్తుంటాడు. – గోల్కొండ

రేపు శ్రీదత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

నాంపల్లి: రెడ్‌హిల్స్‌లో వెలసిన యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈనెల 22న సోమవారం ఉదయం 11 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఉంటుందని తెలిపారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహావచనం, ఆచార్యాది బుత్విక్ వర్ణనం, పంచగవ్యాప్రాశనం, ధాన్యది, శయ్యాదివాస, పుష్పాధివాస, ఫలాధివాసాలు, బలి ప్రదానము, పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 7 గంటలకు సామూహిక అర్చన, మహా హారతి, అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

సెట్విన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్రాష్ కోర్సులు

యాకుత్‌పురా: వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు, గృహిణుల సౌకర్యార్థం ప్రభుత్వ రంగా సెట్విన్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కల్పనకు స్వల్ప కాల వ్యవధిలో సమ్మర్ క్రాష్ కోర్సుల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సంస్థ ఎండీ కే. వేణుగోపాల్ రావు తెలిపారు. పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ..కంప్యూటర్ అవేర్నెస్, గార్మెంట్ మేకింగ్, బ్యూటీషియన్, మెహందీ డీజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మగ్గం వర్క్ కోర్సుల్లో నమమాత్రపు రుసుంతో 45 రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. మే 31 వరకు నిర్వహించే ఈ కోర్సులను పాతబస్తీ మోతీగల్లీ, ముషీరాబాద్, చైతన్యపురీ, ఈదిబజార్, నేరేడ్‌మెట్, ఏసీగార్డ్స్, ఈస్ట్ మారేడ్‌పల్లీ, ఎర్రగడ్డలోని సంస్థ శిక్షణ కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు స్థానిక కేంద్రాల్లోని కో ఆర్డినేటర్లను సంప్రందించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగిన వ్యక్తికి రిమాండ్

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో తాగిన మైకంలో మహిళను దూషించడంతో పాటు పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఓ మందుబాబుకు నాంపల్లి న్యాయస్థానం 14 రోజుల జైలు శిక్షను విధించింది. పోలీసుల కథనం మేరకు.. జంగమ్మెట్ రవీంద్ర నాయక్‌నగర్‌కు చెందిన కెతావత్ మహేష్ నాయక్(29) రెండు రోజుల క్రితం స్థానికంగా కిరాణ దుకాణంలో ఉన్న మహిళను దూషించాడు. ఆమె చేసిన 100 డయల్ ద్వారా ఫిర్యాదును అందుకున్న ఫలక్‌నుమా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా...వారి పట్ల కూడా దురుసుగా ప్రవర్తించాడు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా నిందితుడికి 14 రోజుల శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

‘ప్రజలంతా మజ్లిస్ వెంటే’


నానల్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ చేయిస్తున్న అభివృద్ధి పనులకు ప్రజలంతా మజ్లిస్‌కు మద్దతు పలుకుతున్నారని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన నానల్ నగర్ డివిజన్‌లోని హకీంపేట్, మెరాజ్ కాలనీ, ఎస్‌ఎస్‌ఎఫ్ కాలనీ, కాళాబంగ్ల తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ పార్లమెంటు మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ పని తనాన్ని చూసి ప్రజలంతా ఆయనను ప్రతి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తున్నారన్నారు. ప్రజా హక్కుల పరిరక్షణ కోసం అసదుద్దీన్ ఒవైసీ అలుపెరగని పోరాటం సాగిస్తున్నారన్నారు. ఆయన ప్రాతినిధ్యం వహించే హైదరాబాద్ పార్లమెంటు స్థానమే కాకుండా ఇతర ప్రాంతాలను సైతం అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం


గుడిమల్కాపూర్‌లో ప్రచారంలో బీజేపీ పార్లమెంటు అభ్యర్థి మాధవీలత

గోల్కొండ: బీజేపీకి ఓటు వేయడానికే ప్రజలు మొగ్గు చూపుతున్నారని బీజేపీ హైదరాబాద్ పార్లమెంటు అభ్యర్థి మాధవీలత అన్నారు. శనివారం ఆమె కార్వాన్, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తూ ఇంటింటికీ తిరిగి తనకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పదేళ్ల పాలనపై దేశ ప్రజలంతా తమ ఆమోద ముద్ర వేస్తున్నారన్నారు. కేవలం ఆర్థికంగానే కాకుండా దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో సైతం ప్రధాని మోదీ దేశాన్ని అగ్రపథం వైపు నడిపిస్తున్నారని ఆమె అన్నారు. ప్రాంతీయ పార్టీలతో ప్రజలకు ఒరిగేది ఏమి ఉండదని కేవలం తమ ఉనికి చాటుకోవడానికి మాత్రమే ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో పోటీ చేసుకుంటాయన్నారు. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం కాంపెన్ ఇన్‌చార్జి దేవర శ్రీనివాస్, ప్రభు పూజారి, జి.రాజాకిషన్‌యాదవ్ తదితరులున్నారు.

మజ్లిస్ పార్టీని గెలిపించండి


మాట్లాడుతున్న అక్బరుద్దీన్ ఒవైసీ

యాకుత్‌పురా: పాతబస్తీలో తమ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటువేసి గెలిపించాలని మజ్లిస్ పార్టీ శాసనసభాపక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. సార్వత్రిక ఎన్నికలను సందర్భంగా మజ్లిస్ పార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి, తన సోదరుడు అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా శనివారం సాయంత్రం ఆయన యాకుత్‌పురా రెయిన్‌బజార్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇమాంబడా, తలాబ్‌కట్టా రైల్వేబ్రిడ్జి, మదీనానగర్, సాదత్‌నగర్, యశ్రఫ్‌నగర్, ముర్తుజానగర్, ఈస్ట్ చంద్రానగర్, యాకుత్‌పురా తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ తమ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ప్రత్యేక పూజలు


పూజల్లో పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: వీర హనుమాన్ విజయ యాత్రను పురస్కరించుకొని నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస రెడ్డి తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు రూట్ మార్చ్ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ బజరంగ్‌దళ్ నాయకులు సుభాష్ చంద్ర, పగడాకుల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

‘జియాగూడ నుంచి 50వేల మెజార్టీ ఇస్తాం’



జియాగూడ: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాధవీలతకు జియాగూడ డివిజన్ నుంచి 50 వేల ఓటు బ్యాంకును అందిస్తామని సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి కోశాధికారి కాశిబుగ్గ బాబన్న అన్నారు. శనివారం జియాగూడలోని 2బీహెచ్‌కే కాలనీలోని కార్యాలయ ప్రాంగణంలో హనుమాన్ చాలీసా పఠనం, వేద పారాయణం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాధవీలతకు 50వేల మెజార్టీని డివిజన్ నుంచి ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్వాన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, జగన్‌గౌడ్, పాలెం వెంకటేష్, జుగల్ కిశోర్, పవన్, కె.నర్సింగ్‌రావు, రాజు పాల్గొన్నారు.

టీజీడీఏ ఎన్నికలను నిలిపి వేయాలి


మాట్లాడుతున్న డాక్టర్ శేఖర్

సుల్తాన్‌బజార్: ఈనెల 29న నిర్వహించ తలపెట్టిన తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీడీఏ) ఎన్నికలను వెంటనే నిలిపి వేయాలని టీజీడీఏ ప్రతినిధి డాక్టర్ శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం కోఠిలోని డీఎంఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేసి కోడ్ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీల ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం ఎన్నికలు నిర్వహించాలని కోరారు. 2010లో చేపట్టిన పాత సభ్యత్వంతో ఎన్నికలు నిర్వహించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 మెడికల్ కాలేజీల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిబంధనలకు లోబడి ఉత్సవాలను నిర్వహించాలి


మాట్లాడుతున్న డీసీపీ సాయి చైతన్య

చార్మినార్: ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉత్సవాల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించుకోవాలని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని చార్మినార్ ఏసీపీ డివిజన్ పరిధిలోని ఉత్సవాల నిర్వాహకులతో శనివారం రాత్రి ఘాన్సీబజార్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రాజకీయ పార్టీల జెండాలను ర్యాలీల సందర్భంగా వినియోగించరాదన్నారు. ఎలాంటి ఉద్రేకపూరిత ప్రసంగాలు చేయకుండా శాంతియుత వాతావరణంలో ఊరేగింపులు, పూజలు నిర్వహించాలన్నారు. బందోబస్తులోని తమ పోలీసు సిబ్బందితో పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్, చార్మినార్ ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు కమతం చంద్రశేఖర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడి అరెస్టు


సయ్యద్ అస్లాం షఫీ

బహదూర్‌పురా: ఎలాంటి వైద్య సర్టిఫికెట్ లేకుండా హెయిర్–ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తున్న నకిలీ డాక్టర్‌ను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, కాలపత్తర్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి లిపోల్యాబ్ 10 ఇంజెక్షన్ల బాక్స్, కంట్రోల్ డీ 10–ఆల్కాహాల్ ప్యాకెట్లు మరికొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డిప్యూటీ కమిషనర్ అందె శ్రీనివాసరావు, కాలపత్తర్ ఇన్‌స్పెక్టర్ గోపీ తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పురాకు చెందిన సయ్యద్ అస్లాం షఫీ(41) గచ్చిబౌలిలో హెయిర్–ట్రాన్స్‌ప్లాంటేషన్ డాక్టర్‌గా ఛలామణి అవుతూ లిపోమా చికిత్స అందిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి ఎలాంటి డాక్టర్ సర్టిఫికెట్ లేకుండా గచ్చిబౌలిలో, ఇంట్లో చికిత్స అందిస్తున్న అస్లాం షఫీని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణ నిమిత్తం నిందితుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు కాలపత్తర్ పోలీసులకు అప్పగించారు. కాలపత్తర్ పోలీసులు 417, 419, 420 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

కోరిన కోరికలు నెరవేర్చే కేసరి

- కేసరి హనుమాన్ మహా సంస్థానానికి 400 ఏళ్ల సుధీర్ఘ చరిత్ర
- 23వ తేదీ వరకు హనుమాన్ జయంత్యుత్సవాలు


కేసరి హనుమాన్ ఆలయం


కేసరి హనుమాన్

జియాగూడ: జియాగూడ కార్వాన్ శ్రీ కేసరి హనుమాన్ మహా సంస్థానం సుమారు 400 ఏళ్ల నుంచి ధర్మరక్షణకు కృషి చేస్తోంది. గోల్కొండ శాసన కాలంలో, బ్రిటీష్ నిజాం కాలమున సైతం ధర్మ ప్రచార కార్యం ఈ మహా క్షేత్రం ప్రత్యేక విశిష్టత ఎందరో మహాత్ములు, తపస్సు చేసిన పుణ్యక్షేత్రం. మొక్కులను తీర్చే కేసరి హనుమాన్‌గా ఖ్యాతి.

సీతాదేవిని వెతికే క్రమంలో..

రామాయణ కాలంలో శ్రీరాముడి ఆదేశాల మేరకు హనుమంతుడు సీతాదేవిని వెతుకుతున్న తరుణంలో ముచ్చుకుందా నది ప్రస్తుతం మూసీనది ఒడ్డున స్నానం ఆచరించి ఈ ప్రదేశంలో శ్రీరాముడికి పూజలు నిర్వహించాడు. కాల క్రమంలో వెలిశాడు. సమర్థ రామదాసు స్వామి దేశ సంచార చేస్తున్న సమయంలో మూసీనది ఒడ్డున కేసరి హనుమాన్ ఆలయ నిర్మాణం చేసి ప్రతిష్ఠించారు. ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసు స్వామి కోరిక మేరకు ఛత్రపతి శివాజీ ఆలయాన్ని దర్శించారు.

కుంకుమ పువ్వు, గంధంతో..

ఆలయంలో స్వామివారికి చందనంతో కాకుండా కుంకుమ పువ్వు, గంధంతో తయారు చేసిన కేసరి మాత్రమే పూస్తారు. ఈ కేసరి హనుమాన్‌కు పెద్ద ఎత్తున మీసాలు ఉండడంతో పాటు గంభీరంగా భక్తులకు దర్శనం ఇస్తారు. ఆలయ గర్భగుడిలో తాంబాలంలో ఆవు నెయ్యితో ఐదు అఖండ జ్యోతులు 400 సంవత్సరాల నుంచి వెలుగుతున్నాయి. గర్భుడిలోకి మహిళలకు ప్రవేశం ఉండదు. మొక్కులు కోరే వారు కుంకుమ పువ్వు లేపనం, బగువా వస్త్రం, ఆవు నెయ్యి, కొబ్బరికాయలు స్వామి చెంత పూజించి ముడుపు కడుతారు. ఈ ముడుపులు ప్రతి మంగళవారం, శనివారం మాత్రమే కడుతారు.

ఘనంగా మహోత్సవాలు..

ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు కేసరి హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ వివిధ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. 23న తెల్లవారుజామున కేసరి హనుమాన్ జయంతిని పురస్కరించుకుని స్వామికి ఊయల సేవా, మంగళహారతి, పల్లకీ సేవా, మహా నైవేద్యం, అన్నదాన కార్యక్రమం, భజన సంధ్య కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ప్రతినిధి వినయ్ దేశ్‌పాండే తెలిపారు.

గోల్కొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు


ఐఎస్ఓ గుర్తింపు పత్రం అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: అధ్యాపక బృందం సమష్టి కృషితోనే ఐఎస్ఓ గుర్తింపు లభించిందని గోల్కొండలోని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కపిలవాయి శ్రీనివాస రాజు అన్నారు. ఐఎస్ఓ ప్రతినిధి బృందం శనివారం గోల్కొండలోని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ఐఎస్ఓ గుర్తింపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు మహిళా శక్తి గొప్పదనాన్ని చాటేలా విద్యార్థినుల్లో నూతనోత్తేజం తెచ్చేందుకు అధ్యాపక బృందం ప్రతి నిత్యం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని పేర్కొన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడ్డ గోల్కొండ లాంటి ప్రాంతంలో వేలాది మంది పేద మహిళలకు అత్యుత్తమ స్థాయి విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ఐఎస్ఓ కమిటీ ప్రతినిధులు శివయ్య, సమీరా గుర్తింపు ప్రమాణ పత్రాన్ని ప్రిన్సిపాల్‌కు అందించారు. కార్యక్రమంలో తులసి, ఎన్ఎస్ రజనీష్, బాలశ్రీనివాస్ పటేల్, మంజూర్ హుస్సేన్, అన్వరుద్దీన్, అజయ్‌కుమార్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.